క్లుప్తంగా

డీఎస్పీ విచారణ

సోమందేపల్లి: పందిపర్తి గ్రామంలో ఎస్సీ, ఎస్టీ కేసు పై పెనుకొండ డీఎస్పీ బాజీ జాన్ సైదా శుక్రవారం విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త బంగారు బాబు, వాటర్ ప్లాంట్ వద్ద నీటిని పట్టుకోవడానికి వెళ్లగా వైఎస్సార్ సీపీ కార్యకర్తలు రాజశేఖర రెడ్డి, నరేష్ కులం పేరుతో దూషించారని వచ్చిన ఫిర్యాదుపై విచారణ చేపట్టారు. డీఎస్పీ వెంట ఎస్ఐ విజయ్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో కంది విత్తనాల పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న వీహెచ్ఏ రమేష్

గుడిబండ: మండల పరిధిలోని దేవరహట్టి గ్రామంలో ఉన్న రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం రైతులకు కంది విత్తనాల ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీహెచ్ఏ రమేష్ మాట్లాడుతూ.. ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసేందుకు రైతులకు నాణ్యమైన కంది విత్తనాలను రైతు భరోసా కేంద్రాల్లోనే అందజేస్తున్నట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా 40 క్వింటాళ్ల కంది విత్తనం రైతులకు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. నాణ్యమైన విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటలో ఉన్నాయని.. రైతులు తీసుకెళ్లాలన్నారు.

నేడు జన స్పందన సభ

పావగడ: పట్టణంలోని ఎస్ఎస్‌కే రంగ మందిరంలో శనివారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే హెచ్.వి వెంకటేష్ అధ్యక్షతన జన స్పందన సభ జరగనుంది. ప్రజలందరూ తరలి వచ్చి తమ సమస్యలు పరిష్కరించుకోవాలని స్థానిక తహసీల్దార్ సంతోష్ కుమార్, ఈఓ జానకి రాం శుక్రవారం పత్రిక ప్రకటనలో తెలిపారు. ఈ సభకు జిల్లా కలెక్టర్, సీఈఓ, జిల్లా పోలీసు ఉన్నతాధికారులు హాజరవుతారన్నారు. జిల్లా, తాలూకా స్థాయి రెవెన్యూ తదితర ఇతర శాఖల అధికారులు కూడా వస్తారని తెలిపారు. ప్రజలు తరలి వచ్చి సమస్యలన అక్కడికక్కడే పరిష్కరించుకోవచ్చన్నారు.

రికార్డులు లేని వాహనాలను సీజ్ చేస్తాం



పాఠశాల బస్సును పరిశీలిస్తున్న ఎంవీఈ శివశంకర్

అమరాపురం: వాహనాదారులు తమ వద్ద రికార్డులను తప్పనిసరిగా ఉంచుకోవాలని హిందూపురం మోటర్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ శివశంకర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన అమరాపురం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా పలు వాహనాలను తనిఖీ చేశారు. ఓ బోరువెల్ లారీని తనిఖీ చేయగా.. రికార్డులు సక్రమంగా లేకపోవడంతో అపరాధ రుసుం విధించారు. అలాగే మండలంలోని వివిధ యాజమాన్యాల కింద నడుపుతున్న పాఠశాలల బస్సులను పరిశీలించారు. ప్రతి ప్రైవేటు పాఠశాల బస్సు విధిగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు. అలాగే రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. రికార్డులు లేని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఉప్పర, సగర విద్యార్థులకు రేపు ప్రతిభా పురస్కారాలు

హిందూపురం టౌన్: 10వ తరగతి, ఇంటర్, నీట్‌లో ప్రతిభ కనబరిచిన జిల్లాలోని ఉప్పర, సగర విద్యార్థులకు ఈ నెల 16న పట్టణంలోని సప్తగిరి డిగ్రీ కళాశాలలో ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నారు. ఈమేరకు భగీరథ ఎడ్యుకేషనల్ సేవా ట్రస్ట్ అధ్యక్షుడు ఆదినారాయణప్ప, జనరల్ సెక్రటరీ వెంకటేశులు, ఉపాధ్యక్షుడు కిష్టప్ప, ట్రెజరర్ రామాంజి శుక్రవారం తెలిపారు. కార్యక్రమానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరుకావాలని వారు కోరారు.

విద్యా సామగ్రి కిట్ల పంపిణీ



విద్యా సామగ్రి కిట్లను చూపుతున్న చిన్నారులు

మడకశిరరూరల్: మండల పరిధిలోని కల్లుమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఉపాధ్యాయులతో కలిసి సర్పంచ్ గంగమ్మ విద్యా సామగ్రి కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధించి మంచి ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు.

ప్రైవేట్ పాఠశాల సందర్శన

జిల్లా విద్యాధికారి ఆదేశాల మేరకు శుక్రవారం ఎంఈఓ భాస్కర్ మండల పరిధిలోని అయ్యవారిపల్లి వద్ద ఉన్న ప్రైవేట్ పాఠశాలను సందర్శించారు. రికార్డులు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు.

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటా

- మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్
- దాడులు చేస్తే సహించబోమని టీడీపీ శ్రేణులకు హెచ్చరిక
- పరిగి, సోమందేపల్లిలో కార్యకర్తలు, నాయకులతో సమావేశాలు



సోమందేపల్లి మండలం మాగేచెరువులో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్

పరిగి: ఎన్నికల ఫలితాల తర్వాత టీడీపీ శ్రేణులు తమ పార్టీ శ్రేణులపై దాడులకు దిగుతున్నాయని, బాధితులకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని మాజీ మంత్రి, పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీ చరణ్ భరోసా ఇచ్చారు. శుక్రవారం ఆమె పరిగి బీరప్ప ఆలయ కల్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ కూటమి నేతలు రాష్ట్ర వ్యాప్తంగా అధికారం ఉందనే అహంకారంతో అల్లర్లు, దాడులకు తెగబడుతున్నారన్నారన్నారు. వారిని కట్టడి చేయాల్సిన పోలీసులు సైతం ప్రేక్షక పాత్ర పోషించడం దారుణమన్నారు. అధికారం శాశ్వతం కాదన్న విషయాన్ని గుర్తెరగాలని టీడీపీ కూటమి నేతలకు హితవుపలికారు. ప్రజలిచ్చిన తీర్పును శిరసావహించి, క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యలపై పోరాటాలు, ఉద్యమాలు చేస్తామన్నారు. రానున్న ఐదేళ్లు కూటమి నేతల దాష్టీకాల్ని ప్రజలు గమనిస్తారని, ఇది టీడీపీ వినాశనానికి దారితీయక తప్పదన్నారు. పెనుకొండ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలపై నిరంతం పోరాటాలకు సిద్ధంగా ఉంటానన్నారు. కష్టకాలంలో ప్రతి కార్యకర్తకూ అండగా నిలబడతానని తెలిపారు. కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు గ్రామాలలో టీడీపీ శ్రేణుల అవినీతి అక్రమాలను ఎండగట్టి, ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. నియోజకవర్గంలో గడిచిన ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులే కాకుండా పొందని వారూ జగనన్న ప్రభుత్వానికి అండగా నిలిచారన్నారు. వారందరినీ రాబోయే ఐదేళ్ల కాలంగా కాపాడుకుంటామని తెలిపారు. అనంతరం కాలువపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ నేత గిరి ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరసింహమూర్తి, జెడ్పీటీసీ శ్రీరామప్ప, స్థానిక సర్పంచ్ లక్ష్మీదేవి, మాజీ కన్వీనర్ జయరాం, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు మారుతీరెడ్డి, ముఖ్య నాయకులు నరసింహారెడ్డి, రఫీక్‌ఖాన్, రామాంజి, ఎంపీటీసీ అమరావతి, చిక్కన్న, కేటీ అశ్వర్థప్ప తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు..

సోమందేపల్లి: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటానని మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ భరోసా ఇచ్చారు. శుక్రవారం మండలంలోని మాగేచెరువు గ్రామంలో ఆమె పర్యటించారు. ఈ నెల 4న టీడీపీ నాయకులు ఉద్దేశ పూర్వకంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్త అంజి నివాసం ఎదుట టపాసులు పేల్చి అక్రమ కేసులు పెట్టడం తగదని ఆమె అన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని లేదంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటమని తెలిపారు. అధికారాన్ని అడ్డు పెట్టుకుని టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు చేస్తుంటే ప్రేక్షక పాత్ర వహించడం తగదన్నారు. ఎవరూ అధైర్య పడొద్దని అన్ని విధాల అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ లు రమాకాంత్ రెడ్డి, కంబాలప్ప, ఎంపీటీసీ నాగప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబు, మురళి, అంజి, అల్లాబకష్, జగదీష్, కళ్యాణ్, శ్రీనివాసులు, నరసింహ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ట్రెక్కింగ్ పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

సోమందేపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి గౌరీ శంకర్ జాతీయ స్థాయి ట్రెక్కింగ్ పోటీలకు ఎంపికైనట్లు ఇన్‌చార్జ్ హెచ్ఎం నాగేంద్ర శుక్రవారం తెలిపారు. దివ్యాంగుల రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో భాగంగా వైఎస్సార్ కడప జిల్లాలో జరిగిన ట్రెక్కింగ్, జోమరింగ్, రప్లింగ్ క్రీడల్లో గౌరీ శంకర్ ఉత్తమ ప్రతిభ కనబరిచాడన్నారు. త్వరలో లడక్‌లో నిర్వహించే జాతీయస్థాయి ట్రెక్కింగ్ పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. ఈసందర్భంగా పీడీ వన్నూరప్ప, విజయరామారావు, పీఈటీ రమేష్, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

అమరాపురం: గ్రామాల్లో ఎవరైనా చట్టానికి వ్యతిరేకంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ జనార్ధన నాయడు హెచ్చరించారు. శుక్రవారం సాయంకాలం మండలంలోని ఉదుగూరు, మద్దనకుంట గ్రామాల్లో సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు.

పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించండి



దొడగట్టలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



చిలమత్తూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



లేపాక్షి మండలం చోళసముద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

రొద్దం: మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ కోరారు. శుక్రవారం మండలంలోని వైటీరెడ్డి, దొడగట్ట, రొద్దం, పెద్దగువ్వలపల్లి, గోనిమేకులపల్లి గ్రామాల్లో 'అంగన్‌వాడీ పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీలలో చేర్పాలని నినాదిస్తూ అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఆయా అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

చిలమత్తూరు: పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రీస్కూల్‌లో చేర్పించాలని కోరుతూ శుక్రవారం మండలంలోని కొడికొండలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మన అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధ మాట్లాడుతూ ప్రీస్కూల్ ద్వారా చిన్నారులకు మంచి ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తామన్నారు. అలాగే మధ్యాహ్నం పిల్లలకు పోషక విలువలున్న ఆహారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు అలీముల్లా, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం, లేపాక్షి సెక్టార్‌లో శుక్రవారం అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీలక్ష్మి, మంజుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల తల్లులతో సమావేశం నిర్వహించి, మూడు సంవత్సరాలు నిండిన పిల్లలనును అంగన్‌వాడి కేంద్రంలో చేర్పించాలని సూచించారు. అనంతరం పిల్లలు, తల్లులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

రొళ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లోని అంగనవాడీ కేంద్రాల్లో శుక్రవారం అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం కార్యక్రమం నిర్వహించారు. తల్లిదండ్రులు, చిన్నారులతో కలిసి అంగనవాడీ వర్కర్లు అవగాహన ర్యాలీ చేపట్టారు. చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సన్నమ్మ, అంగన్‌వాడి కార్యకర్త ఇందిరమ్మ సూచించారు.

గుడిబండ: మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల వద్ద శుక్రవారం 'అంగన్‌వాడీ పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడి టీచర్లు, ఆయాల ఆధ్వర్యంలో ర్యాలీలు చేపట్టారు. అంగన్‌వాడీల్లో కల్పిస్తున్న వసతులను అంగన్‌వాడీ టీచర్ మహదేవమ్మ వివరించారు. ఐదేళ్లు దాటిన 6 మంది చిన్నారులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందించి ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు.

విధులకు సక్రమంగా హాజరుకండి



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ అపూర్వ భరత్

అమరాపురం: గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న ఉద్యోగులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని వలస గ్రామంలో వివిధ పాఠశాలలు, సచివాలయం, సబ్ సెంటర్, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మాట్లాడారు. అందరూ మధ్యాహ్న భోజనం చేశారా? సక్రమంగా అంగన్‌వాడీ కేంద్రానికి వస్తున్నారా అని ఆరా తీశారు. అలాగే కేంద్రంలో ఎంత మంది ప్రీ స్కూల్ పిల్లలు ఉన్నారు? గర్భవతులు, బాలింతలు, వారికి అందించే పౌష్టికాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. పౌష్టికాహారం సక్రమంగా అందించాలని సూచించారు. ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఎంతమంది ఉన్నారు? పిల్లలకు అర్థమయ్యేలా బోధన చేయాలన్నారు. సబ్‌సెంటర్‌ను పరిశీలించి, సక్రమంగా విధులకు సిబ్బంది హాజరు కావాలన్నారు. రోజూ రోగులను పరీక్షించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం అందించే మందులను సక్రమంగా ఇవ్వాలన్నారు. విధులకు గైర్హాజరైతే చర్యలు తప్పవన్నారు. ప్రాథమిక పాఠశాల, సచివాలయాన్ని సందర్శించారు. సచివాలయానికి వచ్చే రైతులు, ప్రజలకు సేవ చేయాలన్నారు. సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని ఇక్కడే పరిష్కరించాలన్నారు. ప్రజలు కార్యాలయం చుట్టూ తిరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటసుబ్బయ్య, ఎంపీడీఓ మునిస్వామి, ఉపాధ్యాయులు, సచివాలయం సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్త శారద పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రిలో రక్తదానం చేస్తున్న దృశ్యం



పావగడలో రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న వైద్యులు

హిందూపురం: రక్తదానం ప్రాణదానంతో సమానమని బ్లడ్‌బ్యాంకు ఇన్‌చార్జి డాక్టర్ చరణ్ అన్నారు. రక్తదాతల దినోత్సవం సందర్భంగా శుక్రవారం హిందూపురం ప్రభుత్వ వైద్యశాలలో పరిటాల చారిటబుల్ ట్రస్టు యుగంధర్ అధ్యక్షతన రక్తదానం శిబిరం నిర్వహించారు. అనంతరం రక్తదానం చేసే సామాజిక సేవా సంస్థలు, రక్తదాతలకు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి బ్లడ్‌బ్యాంకు సిబ్బంది వినోదిని, అంజి, అఖిల భారత షహీద్ టిప్పుసుల్తాన్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారూక్, లైఫ్ వరల్డ్ ఉదయ్ కుమార్, చైతన్య గంగిరెడ్డి, వారధి చారిటబుల్ నిర్వాహకుడు రాము తదితరులు పాల్గొన్నారు.

30 మంది రక్తదానం

పావగడ: తాలూకాలోని లింగదహళ్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం స్వయం ప్రేరిత రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 30 మందికి పైగా రక్తదానం చేశారు. దాతల ద్వారా 20 యూనిట్ల రక్తాన్ని సేకరించామని లింగదహళ్లి పీహెచ్‌సి వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆడ మగ తేడా లేకుండా 18 నుంచి 60 ఏళ్లలోపు ఉన్న ఆరోగ్యవంతులు రక్తదానం చేయవచ్చన్నారు. రక్తదానంతో కొత్త రక్తం ఉత్పత్తి అవుతుందన్నారు. రక్తంలో కొవ్వు శాతం తగ్గిపోతుందన్నారు. గుండెపోటు తదితర వ్యాధులు దాదాపు 80 శాతానికి పైగా తగ్గిపోతాయని పేర్కొన్నారు. రక్తదానంతో ప్రాణాలు కాపాడవచ్చని గుర్తు చేశారు. ఈ శిబిరంలో జిల్లా ఆరోగ్య, సంక్షేమ శాఖాధికారి డా మంజునాథ్, తాలూకా వైద్యాధికారి తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు. గ్రామ సమాజ సేవకులు మదన్ రెడ్డి, హనుమేశ్, ఉమేశ్, చంద్రశేఖర్, వీరేంద్ర కుమార్, సిద్ధలింగప్ప తదితరులు రక్త దాతలకు సేవలందించారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం



పెద్దిపల్లిలో చట్టాలపై నాటిక రూపంలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రొద్దం: మహిళలకు వారికి సంబంధించిన చట్టాలపై పూర్తి అవగాహన ఉండాలని అనంతశక్తి సొసైటీ సీఈఓ లావణ్య సూచించారు. పెద్దిపల్లిలో అనంత శక్తి సొసైటీ న్యాయసలహాల మండలి ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు హక్కుల రక్షణ కల్పించిన ప్రత్యేక చట్టాల గురించి తెలుసుకున్నప్పుడే తమ పట్ల సమాజం చూపుతున్న వివక్షను గ్రహించి, ఎదుర్కోగలిగితే ధైర్యం వస్తుందన్నారు. మహిళలకు న్యాయ సలహాల మండలి ఉచిత న్యాయ సాయం అందిస్తుందని చెప్పారు. స్త్రీల హక్కులు, దిశ, చట్టాలు, బాల్య వివాహాలు, లైంగిక నేరాల నుంచి పిల్లలను రక్షణ చట్టం(పోక్సో), గృహహింస, వేధింపుల, తదితర చట్టాలను వివరించారు. మహిళలకు న్యాయం జరిగితే ధైర్యంగా ముందకు వచ్చి అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళా చట్టాలపై మహిళలకు నాటిక రూపంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛమైన నీరు అందించాలి



మాట్లాడుతున్న గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు శృతి

పావగడ: గ్రామ పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని బ్యాడనూరు గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు శృతి జి.కృష్ణ అధికారులకు సూచించారు. శుక్రవారం బ్యాడనూరు గ్రామ పంచాయతీ సభా ప్రాంగణంలో పంచాయతీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తాగునీరు అందించడంలో గ్రామ పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. ప్రతి గ్రామంలోనూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నీటి సరఫరా, విద్యుత్ దీపాలు, మురుగు కాల్వల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలు, దేవాలయాలు, పాఠశాలల వద్ద ఉన్న వ్యర్థ పదార్థాలను ఎప్పటి కప్పుడు తొలగించి శుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రాపం ఉపాధ్యక్షుడు డీహెచ్ దేవరాజు, సభ్యులు త్రివేణి, అక్కమ్మ, సరోజమ్మ, తిప్పేస్వామి, సావిత్రమ్మ, కృష్ణమూర్తి,లలితమ్మ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

రుచికరమైన భోజనం వడ్డించాలి

రొళ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం వడ్డించాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అలుపనపల్లి, రత్నగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఆయా పాఠశాలల్లో రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థుల హాజరు శాతం, కొత్తగా అడ్మిషన్లు, మధ్యాహ్న భోజనం పథకం అమలు తీరుపై ఆరా తీశారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావాలని సూచించారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



కౌన్సిలర్లతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు ఈరలక్కప్ప

మడకశిర: పార్టీ నాయకులు, కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని వైఎస్సార్‌సీపీ నాయకుడు ఈరలక్కప్ప భరోసా ఇచ్చారు. శుక్రవారం ఆయన పట్టణంలోని తన స్వగృహంలో మున్సిపల్ కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారు. కౌన్సిలర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు సమస్యలను ఈరలక్కప్ప దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఈరలక్కప్ప మాట్లాడుతూ.. పార్టీ ఓడినా నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని సూచించారు. పార్టీ బలోపేతానికి అందరూ కష్టపడి పని చేయాలని కోరారు. వైఎస్ జగన్ పేదల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేశారని తెలిపారు. అయినా ప్రజలు ఎందుకు ఓడించారో తెలియడం లేదన్నారు. భవిష్యత్‌లో వైఎస్సార్‌సీపీకి అధికారం రావడం తథ్యమని తెలిపారు. వచ్చే 5 ఏళ్లలో నాయకులు, కార్యకర్తలు ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై పోరాటం చేసి ప్రజాభిమానాన్ని పొందాలని కోరారు. సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసి ప్రజలకు అండగా ఉండాలని సూచించారు. సమావేశంలో కౌన్సిలర్లు అన్సర్, సిద్ధప్ప, పార్టీ నాయకులు జయరాజ్, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

గోరంట్ల: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పర్జలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ శృతి, మలేరియ సబ్ యూనిట్ అధికారి శివన్న ప్రజలకు సూచించారు. బూదిలి గ్రామంలో శుక్రవారం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దోమల వల్ల మలేరియా, డెంగీ, చికున్‌గన్యా, ఫైలేరియా, మెదడువాపు జ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. దోమలు ఉత్పత్తి కాకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఘనంగా మండల పూజ

లేపాక్షి: మండలంలోని వడ్డిపల్లిలో ఉన్న మహేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో మండల పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయం నిర్మించి 40 రోజులు పూర్తికావడంతో పాటు ఈ నెల 18న అమ్మవారి జాతర నేపథ్యంలో ఆలయంలో పూజలు చేశారు. ఆలయంలో వేదబ్రాహ్మణులచే పంచామృతాభిషేకం, గణపతి పూజ, పుణ్యావాచకం, కలశ స్థాపన, దుర్గాహోమం తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

బక్రీద్ ప్రశాంతంగా జరుపుకోండి



మాట్లాడుతున్న డీఎస్పీ బాజీజాన్‌సైదా

పెనుకొండ: బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ బాజీజాన్‌సైదా ప్రజలకు సూచించారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో స్థానిక ముస్లీం మతపెద్దలతో డీఎస్పీ శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూముస్లీంలు పర్వదినం నేపథ్యంలో ఎలాంటి విభేదాలకు తావివ్వకుండా శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. సీఐ యుగంధర్, ఎస్ఐ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రొద్దం: బక్రీద్‌ను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్ఐ వలీబాషా ముస్లిం మతపెద్దలకు సూచించారు. శుక్రవారం సాయంత్రం పోలీస్ స్టేషన్ ఆవరణలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ బక్రీద్ పండుగను ముస్లింలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలన్నారు. గోవధ చేయరాదని సూచించారు.

అమరాపురం: మండలంలో బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్ఐ జనార్ధన నాయుడు సూచించారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని ముస్లింలతో సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా ఉన్నతాదికారుల ఆదేశాల మేరకు కొన్ని సలహాలు సూచనలను ముస్లిం మత పెద్దలకు వివరించారు. సోమవారం బక్రీద్ సందర్భంగా మండలంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. అలాగే ముస్లింలతో శాంతి కమిటీని ఏర్పాటు చేశారు.

రాజ్యాంగంపై అవగాహన అవసరం

పావగడ: రాజ్యాంగంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని మైసూరు విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్రం అధ్యాపకుడు డాక్టర్ భరత్ రాజ్ అభిప్రాయపడ్డారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో రాజ్యాంగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ అందించిన రాజ్యాంగంపై అందరికీ అవగాహన కల్పించి చైతన్య వంతులను చేసే బాధ్యత విజ్ఞాన వంతులపై ఉందన్నారు. స్థానిక డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్ మురళీధర్ మాట్లాడుతూ.. పోటీ పరీక్షలకు తయారయ్యే విద్యార్థులు రాజ్యాంగంపై జ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు.

'విద్యాలయాల సమయానికి బస్సులు నడపండి'

హిందూపురం టౌన్: పాఠశాలలు, కళాశాలల సమయానికి అనుగుణంగా ఆర్టీసీ బడి బస్సులు నడపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపోలో అసిస్టెంట్ డీఎం హంపన్నకు వినతిపత్రం అందజేశారు. బాబావలి మాట్లాడుతూ చిలమత్తూరు, లేపాక్షి, పెనుకొండ, మడకశిర, సోమందేపల్లి, రొద్దం మండలం నుంచి వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసించడానికి హిందూపురం పట్టణంలోని వివిధ పాఠశాలు, కళాశాలకు వస్తుంటారన్నారు. అయితే సమయానికి బస్సులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.